క్లుప్తంగా

చెత్త సంపద కేంద్రం పరిశీలన



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మెళియాపుట్టి: ప్రభుత్వ భవన నిర్మాణాలు నాణ్యతతో ఉండాలని సామాజిక తనిఖీ ఎస్‌ఆర్పీ రామారావు అన్నారు. మండలంలోని పద్మ గ్రామ పంచాయతీలో ఇటీవల నిర్మాణం చేపట్టిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. నిర్మాణ కొలతలను తీసుకున్నారు. సామాజిక తనిఖీ బృందం ఉపాధి హామీ ద్వారా చేసిన పనులు, భవన నిర్మాణాలైన ఆర్బీకేలు, సచివాలయ భవనాల నాణ్యతను పరిశీలిస్తున్నామని తెలిపారు. డీఆర్పి సత్యం, ఈసీ ఆదినారాయణ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు తిరుపతిరావు, కృష్ణ, ఎఫ్‌ఏ రాజు ఉన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ఆమదాలవలస: చట్టాలపై మహిళలకు అవగాహన ఉండాలని ఆమదాలవలస జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం మహిళలకు చట్టాలపై, వితంతు పింఛన్ పొందేందుకు సంబంధించిన వివరాలపై అవగాహన కల్పించారు. వితంతు పింఛన్‌కు దరఖాస్తు చేసుకునే విధానాన్ని వివరించారు. పింఛన్ సకాలంలో అందకపోతే న్యాయస్థానాన్ని సంప్రదించే విధానాలను తెలియజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు కణిత విజయలక్ష్మి, సీనియర్ న్యాయవాదులు పైడి వరహానరసింహులు, గోవిందరావు, హనుమంతు అప్పలనాయుడు, బొడ్డేపల్లి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటితో అవస్థలు



రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

సారవకోట: మండలంలోని మదనాపురం గ్రామం నుంచి కిడిమి వెళ్లే మార్గంలో మురగు నీరు నిల్వ ఉంటుంది. వర్షం పడితే నీరు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో రోడ్డుపై కొన్ని రోజులపాటు నిల్వ ఉంటుంది. దోమలు, ఈగలు వృద్ధి చెందడంతో వ్యాధులు సోకుతున్నాయని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. దీనిపై సంబంధిత సిబ్బంది చర్యలు తీసుకుని మురగు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దూర విద్యపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈఓలు, సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బంది

మెళియాపుట్టి: మధ్యలో చదువు మానేసిన విద్యార్థులు దూర విద్యలో పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లను చదువుకునే అవకాశం ఉందని ఎంఈఓలు దేవేంద్రరావు, పద్మనాభరావు అన్నారు. మండల కేంద్రంలో దూరవిద్యపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మారుమూల పల్లెల్లో సైతం దూరవిద్య గురించి ప్రచారం చేయాలన్నారు. డ్వాక్రా సంఘాల మహిళలు, సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

76 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి పావని

బూర్జ: మండలంలోని అల్లెన గ్రామంలో బూర్జ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఐ.పావని ఆధ్వర్యంలో 76 మందికి శనివారం వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. 15 మంది జ్వరపీడితులను గుర్తించి రక్త నమూనాలు సేకరించారు. వైద్యాధికారి మాట్లాడుతూ వర్షాలు పడుతున్నందున గ్రామంలో అంటురోగాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందన్నారు. ప్రజలందరూ కాచి చల్లార్చిన నీటిని, వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు.

గొట్టిపల్లిలో పొలంబడి

కొత్తూరు: వరి సాగు చేస్తున్న పొలం గట్టులపై పైరుకు రక్షణ కల్పించే పంటలైన బంతి, కంది, కూరగాయలుతోపాటు పలు రకాల పంటలు సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి స్వర్ణలత అన్నారు. మండలంలోని గొట్టిపల్లిలో శనివారం పొలంబడి కార్యక్రమంలో భాగంగా క్షేత్ర సందర్శన నిర్వహించారు. పొలం గట్లుపై రక్షణ పంట వల్ల పలు రకాల విషపూరిత పురుగు మందులు పిచికారీ చేసినప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గాలికి ఎదురుగా పిచికారీ చేయకూడదన్నారు. బంతి మొక్కలను రైతులకు పంపిణీ చేశారు. ఎంటీ సూర్యనారాయణ, గ్రామ వ్యవసాయ సహాయకులు నవీన్, పలువురు వ్యవసాయ, ప్రకృతి శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

• సందడి



శ్రావణ మాసంలో వచ్చే రాఖీ పండగ అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక. తమ సోదరులకు రాఖీలు కట్టి వారి ఆశీస్సులు పొందడం సోదరీమణులకు ఎంతో ప్రత్యేకం. అలాంటి రాఖీ పండగ సోమవారం నిర్వహిస్తున్నారు. ఈ పండగకు ఒక్కరోజే సమయం ఉండటంతో శనివారం నరసన్నపేట మార్కెట్‌లో రాఖీలు కొనుగోలుకు యువతలు ఉత్సాహం చూపారు. పెద్ద సంఖ్యలో రాఖీలు కొనుగోలు చేశారు. దీనికి తగ్గట్టుగా వ్యాపారులు కూడా పలు కూడళ్ల వద్ద ప్రత్యేక షాపులు పెట్టి రకరకాల రాఖీలు అమ్మకానికి ఉంచారు. దీంతో మెయిన్ రోడ్డుతో పాటు కాలేజీ రోడ్డులో కొనుగోలుదారులతో సందడి నెలకొంది. గ్రామాల్లో ఇదే రోజు జంజాల పౌర్ణమి నిర్వహిస్తారు. ఇంటో ప్రత్యేక పూజలు నిర్వహించిన జంజం మార్చుకుంటారు.

– నరసన్నపేట

• నాసిరకం



బాలింతలు, గర్భిణులు, చిన్నారుల పోషకాహారవృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే కోడిగుడ్లలో నాణ్యత, పరిమాణం సక్రమంగా ఉండడంలేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. బూర్జ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో సరుబుజ్జిలి, బూర్జ మండలాల పరిధిల్లో 147 అంగన్‌వాడీ కేంద్రాల్లో 2,880 మంది లబ్ధిదారులున్నారు. వీరికి ప్రతీ నెల సుమారు 80 వేల గుడ్లను గుత్తేదారు ద్వారా సరఫరా జరుగుతుంది. రోజుల తరబడి నిల్వ చేసి సరఫరా చేస్తున్నారని, అంగన్‌వాడీ కేంద్రాల్లో మరికొద్దిరోజులు నిల్వ ఉంచిన తర్వాత పంపిణీ చేస్తున్నారన్నారు. గుడ్లు చాలావరకు కరిగిపోయి, కుళ్లిపోతున్నాయన్నారు. ఉడికించి ఇచ్చిన గుడ్లు తినే సమయంలో కుళ్లిన వాసన వస్తుందన్నారు. ఇదే విషయమై బూర్జ ఐసీడీఎస్ పీఓ గీత వద్ద ప్రస్తావించగా.. నాసిరకం, పరిమాణం తక్కువగా ఉన్న గుడ్లు సరఫరా చేస్తే పరిశీలన చేసి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

– సరుబుజ్జిలి

• మూలకుచేరింది..



చెత్తను తరలించే వాహనం మూలకు చేరింది. సరుబుజ్జిలి మండలానికి రెండు పారిశుద్ధ్య వాహనాలు కేటాయించారు. వీటిలో ఒక వాహనం ఇచ్ఛాపురంలో పారిశుద్ధ్య అవసరాలకు వినియోగిస్తున్నారు. సరుబుజ్జిలి మండలంలోని అన్ని పంచాయతీలకు విడతల వారీగా చెత్తను తరలించేందుకు ఈ వాహనాన్ని ఏర్పాటు చేశారు. వాహనానికి డీజిల్, డ్రైవర్ జీతం పంచాయతీ నిధుల నుంచే కేటాయించాలని నిబంధనలు పెట్టారు. దీంతో ఏ పంచాయతీ సర్పంచ్ దీన్ని వినియోగించేందుకు ముందుకు రాలేదు. అప్పటినుంచి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోనే ఈ వాహనం ఉంది. ఈ వాహనాన్ని మళ్లీ ఉపయోగించేలా అధికారులు చర్యలు చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

కోల్‌కతా ఘటనపై నిరసన

కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన లైంగిక దాడి, హత్యపై వైద్యులు, సిబ్బంది తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఐఎంఏ(ఇండియన్ మెడికల్ అసోసియేషన్) పిలుపుమేరకు శనివారం ర్యాలీలు, ప్రదర్శనలు, మానవహారాలు, రాస్తారోకోలు చేపట్టారు. హత్యకు గురైన వైద్యురాలి ఆత్మకు శాంతి కలగాలని కొవ్వొత్తుల ప్రదర్శనలు చేశారు. సత్వరమే విచారణ పూర్తిచేసి దోషుల్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్యులకు పూర్తిస్థాయి భద్రత కల్పించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్



సారవకోట: సారవకోటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది



నరసన్నపేట: ఆస్పత్రి మెయిన్ గేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు, సిబ్బంది



సారవకోట: బుడితిలో మానవహారంగా ఏర్పడిన సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది



మెళియాపుట్టి: మూడు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహిస్తున్న చాపర, మెళియాపుట్టి, కరజాడ పీహెచ్‌సీల వైద్య సిబ్బంది



ఎల్.ఎన్.పేట: ర్యాలీ నిర్వహిస్తున్న లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది



ఎల్.ఎన్.పేట: మానవహారంగా ఏర్పడిన తురకపేట వైద్యులు, సిబ్బంది



బూర్జ: ర్యాలీ నిర్వహిస్తున్న బూర్జ, గుత్తావల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది



కొత్తూరు: నాలుగు రోడ్ల కూడలి వద్ద నిరసన తెలియజేస్తున్న గ్రామీణ వైద్యులు



పాతపట్నం: ర్యాలీ నిర్వహిస్తున్న పాతపట్నం సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది



హిరమండలం: బస్టాండ్ కూడలిలో మానవహారంగా ఏర్పడిన హిరమండలం, చొర్లంగి పీహెచ్‌సీల వైద్య సిబ్బంది, విద్యార్థులు



పొందూరు: తహసీల్దార్ రమేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న పొందూరు, కింతలి, తాడివలస వైద్యులు



ఆమదాలవలస: కొర్లకోటలో నిరసన తెలియజేస్తున్న తొగరాం పీహెచ్‌సీ వైద్యాధికారి స్రవంతి, సిబ్బంది

చెట్ల కొమ్మలు తొలగింపు

పాతపట్నం: స్థానిక రైల్వే ట్రాక్ పక్కన ఉన్న భారీ వృక్షాల కొమ్మలను రైల్వే అధికారులు తొలగించారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే ట్రాక్ విద్యుత్ లైన్ పక్కన ఉన్న మర్రి, టేకు, మామిడి చెట్ల కొమ్మలను నరికివేశారు. గుణుపూర్–నౌపడ వరకు విద్యుత్ వైర్లకు తగిలిన చెట్ల కొమ్మలను తొలగిస్తున్నామని రైల్వే అధికారులు తెలిపారు.



రైల్వేస్టేషన్ వద్ద ఉన్న భారీ వృక్షాల కొమ్మలను తొలగిస్తున్న దృశ్యం

సత్యసాయి దీక్షలు ప్రారంభం

ఎల్.ఎన్.పేట: భగవాన్ సత్యసాయి 99వ జయంతోత్సవాలు సందర్భంగా సత్యసాయి దీక్షలను శనివారం ప్రారంభించినట్లు సత్యసాయి భజన మండలి కన్వీనర్ ఎ.నారాయణరావు తెలిపారు. శ్యామలాపురంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని సత్యసాయి మందిరంలో నవంబర్ 23వ తేదీ వరకు ప్రతీరోజు ప్రత్యేక పూజలు, భజనలు, దీపారాధన, నగర సంకీర్తన వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ పనులు

మెళియాపుట్టి: ఈదురుగాలులకు నేలకొరిగిన విద్యుత్ స్తాంభాల పునరుద్ధరణ పనులు విద్యుత్ శాఖ అధికారులు వేగవంతంగా పూర్తిచేశారు. శుక్రవారం భారీగా వీచిన గాలులకు మండలంలోని రంపఖాన, చిన్నహంస గ్రామాలకు మధ్య టిక్కలిపటన్నం వెళ్లే ముఖ్య రహదారిలో నాలుగు విద్యుత్ స్తాంభాలు నేలకొరిగాయి. రహదారికి అడ్డంగా విద్యుత్ తీగలు పడిపోయాయి. ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అధికారులు వెంటనే మరమ్మతు చర్యలు చేపట్టారు. శనివారం ఉదయానికి విద్యుత్ సరఫరా నిలిచిన గ్రామాలకు విద్యుత్‌ను అందించారు. ఆయా గ్రామాల ప్రజలకు విద్యుత్ సమస్య పరిష్కారమైంది.



రంపఖాన వద్ద విద్యుత్ పునరుద్ధరణ పనులు నిర్వహిస్తున్న సిబ్బంది

కూటమిది అప్రజాస్వామికం

● వైఎస్సార్‌సీపీ నాయకుల ఆరోపణ

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలను పోలీసు బలగాలతో నిర్వహించారని సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకులు ముగడ దివాకర్‌నాయుడు, ముగడ జనార్దన ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన తరువాత స్థానిక విలేకర్లతో వారు మాట్లాడారు. ఎన్నికల నిబంధనలు పాటించకుండా విద్యార్థుల తల్లిదండ్రులను భయపెట్టి ఎన్నికలు నిర్వహించారని వాపోయారు. ప్రజా స్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలే తప్ప.. ప్రజలను, ఓటర్లను భయపెట్టి ఎన్నికలు జరపడం విడ్డూరంగా ఉందన్నారు. పోలీసులు ప్రజలకు రక్షణగా ఉండాలని, తప్పు జరిగితే చట్టం అమలు చేయాలేగాని అధికార పార్టీ నాయకులకు కొమ్ముకాయటం మానుకోవాలన్నారు. మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులంతా కలిసి వచ్చి పోలీసులను అడ్డంపెట్టుకుని ఎన్నికలు నిర్వహించటాన్ని తప్పుబట్టారు. వీరితోపాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉత్కంఠ భరితంగా..

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్–3, కడుము జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు జరిగాయి. మెట్టూరు బిట్–3 పాఠశాల ఎన్నికలపై మండలంలోని ఒక వర్గం దృష్టంతా ఉంది. ఈ పాఠశాలలో జరిగిన ఎన్నికల్లో తొమ్మిది మంది డైరెక్టర్‌లుగా వైఎస్సార్‌సీపీ నాయకుడు బూర్లె శ్రీనివాసరావు అనుచరులు ఎన్నికయ్యారు. మిగిలిన రెండు తరగతలకు ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఈ పాఠశాల చైర్మన్ ఎన్నిక ఎలాగైనా నిర్వహించాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. పాఠశాల వద్ద స్థానిక సీఐ చింతాడ ప్రసాదరావు భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. బూర్లె శ్రీనివాసరావును పోలీస్‌లు ముందస్తు అరెస్టు చేసి ఎన్నికలు జరిగినంత వరకు పోలీస్ స్టేషన్‌లోనే ఉంచారు. శ్రీనివాసరావు వర్గానికి చెందిన ఓటర్లను కొంత మంది కూటమి నాయకులు భయపెట్టి ఓట్లు వేయించుకొన్నట్లు తెలిసింది. చివరకు ఒక ఓటు తేడాతో చైర్మన్‌గా కె.రవి, వైస్ చైర్మన్‌గా కొట్నాల స్వాతి ఎన్నికైనట్లు ఎంఈఓ తెలిపారు. కడుము జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్నిక సజావుగా జరిగింది. చైర్మన్‌గా బూరాడ రమేష్, వైస్ చైర్మన్‌గా కిల్లారి జయ సుధ ఎన్నికైనట్లు హెచ్ఎం తిరుమలరావు చెప్పారు.



హిరమండలం: కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న దృశ్యం

ఆదర్శ పాఠశాలలోనూ..అంతే

పోలాకి: ఆదర్శ పాఠశాలల్లో కూడా కూటమి నాయకులు బెదిరింపులకు పాల్పడ్డారు. అధికార పార్టీ నాయకులకు ఉపాధ్యాయులు, పోలీసులు వత్తాసు పలికారు. ఉదయం నుంచే సీఐ, ఎస్ఐలతో పాటు సిబ్బందిని మోహరించారు. అధికార పార్టీకి అనుకూలంగా ఎన్నిక చేపట్టారు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

రెండు చోట్ల ఎన్నిక.. ఒక చోట వాయిదా

ఎల్.ఎన్.పేట: మండలంలోని మూడు ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం నిర్వహించిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికల్లో రెండు చోట్ల ఎన్నిక జరగ్గా.. ఒక చోట వాయిదా పడింది. లక్ష్మీనర్సుపేట జెడ్పీ ఉన్నత పాఠశాల, చింతలబడంజ ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు పూర్తయ్యాయి. పూశాం జెడ్పీ ఉన్నత పాఠశాల ఎన్నికలకు 7, 8 తరగతుల్లో కోరం లేనందున వాయిదా వేసినట్లు ఎంఈఓ చంద్రమౌళి తెలిపారు.



ఎల్.ఎన్.పేట: మాట్లాడుతున్న సర్పంచ్ దివాకర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు జనార్దన, తదితరులు

రెండు చోట్ల కమిటీల ఎన్నిక..

హిరమండలం: మండలంలో మూడు పాఠశాలల్లో యాజమాన్య కమిటీలకు ఎన్నికలను శనివారం నిర్వహించారు. ఒకచోట కోరం లేక ఎన్నిక వాయిదా పడింది. మరో రెండు చోట్ల ఎన్నికలు నిర్వహించారు. హిరమండలం ఉన్నత పాఠశాల యాజమాన్య కమిటీ చైర్‌పర్సన్‌గా సింహాద్రి కల్యాణి, వైస్ చైర్మన్‌గా గొంటి అప్పయ్య ఎన్నికయ్యారు. గొట్టా ప్రాథమికోన్నత పాఠశాల కమిటీ చైర్‌పర్సన్‌గా దాసరి స్వాతి, వైస్ చైర్మన్‌గా పుట్టా రాజు ఎంపికయ్యారు. చిన్నకొల్లివలస ప్రాథమిక పాఠశాలలో కోరం లేకపోవడంతో ఎన్నికలు జరగలేదని ఎంఈఓ రాంబాబు తెలిపారు.

మళ్లీ వాయిదాపడిన ఎస్ఎంసీ ఎన్నికలు

సరుబుజ్జిలి: మండలంలో శనివారం జరగాల్సిన ఎస్ఎంసీ ఎన్నికలు మరలా వాయిదాపడ్డాయి. గత వారం కొండవలస, పురుషోత్తపురం జెడ్పీ హైస్కూళ్లు, పురుషోత్తపురం ప్రాథమిక, ఫకీర్‌సాహెబ్‌పేట, ఇస్కలపాలెం, పెద్దసవళాపురం పాఠశాలల్లో జరగాల్సిన ఎన్నికలు కోరంలేక వాయిదావేశారు. అయితే ప్రస్తుతం పురుషోత్తపురం ప్రాథమిక, కొండవలస ప్రాథమికోన్నత పాఠశాలలకు మాత్రమే ఎన్నిక పూర్తయింది. మిగిలిన వాటిలో కోరంలేక మరలా వాయిదా వేశామని, ఉన్నతాధికారుల నుంచి వచ్చిన అనుమతుల మేరకు ఎన్నికల తేదీని ప్రకటిస్తామని ఎంఈఓ డి.బాలరాజు వెల్లడించారు.



కొత్తూరు: ముందుస్తు అరెస్టుతో పోలీస్ స్టేషన్‌లో ఉన్న బూర్లె శ్రీనివాసరావు



కొత్తూరు: మెట్టూరు బిట్-3 పాఠశాల వద్ద ఎస్ఎంసీ ఎన్నిక సందర్భంగా భారీగా ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తు



పోలాకి: ఈదులవలస ఆదర్శ పాఠశాల వద్ద పోలీసుల బందోబస్తు

సంక్షిప్తంగా...

విలువలతో కూడిన విద్యను అందించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస: విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు బోధించాలని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని తొళ్లవలస గ్రామం వద్ద ఉన్న కేజీబీవీలో ఆడ పిల్లలను చదివిద్దాం.. రక్షిద్దాం అనే అంశంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని పిల్లలు, నిరాశ్రయులైన పిల్లల కోసం కేజీబీవీలు ఏర్పాటయ్యాయన్నారు. 1990లో అప్పటి కేంద్ర ప్రభుత్వం ఏయే మండలాల్లో మహిళలు విద్యలో వెనుకబడి ఉన్నారో, ఆ మండలాల్లో కేజీబీవీలు ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కేజీబీవీ ఎస్ఓ పి.శిరీష, ఏఎస్ఐ రేణుకా రాణి, సోషల్ కౌన్సిలర్ ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

వితంతు పింఛన్‌కు దరఖాస్తు చేసుకోండి

పాతపట్నం: మండలంలోని 18 గ్రామ సచివాలయాల పరిధిలోని ఎవరైనా వింతువులకు పింఛన్ రాకపోతే దరఖాస్తు చేసుకోవాలని పాతపట్నం కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోషిణి అన్నారు. పాతపట్నం అంబేడ్కర్ జంక్షన్ వద్ద ఉన్న పాతపట్నం గ్రామ సచివాలయం-3లో మండల న్యాయ సేవా సంఘం ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ వితంతు పింఛన్ అందకపోతే, అర్హులై ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బీఈ సత్యనారాయణ, న్యాయవాది ఎం.రమణ, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, ప్రజలు పాల్గొన్నారు.

ఆర్థిక నేరాలపై అప్రమత్తం

కొత్తూరు: ఆర్థిక నేరాలపై గ్రామీణ మహిళలు అప్రమత్తంగా ఉండాలని సోషల్ ట్రాన్స్‌ఫర్ మిషన్ స్వచ్ఛంద సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ ఎ.హరినాథ్ అన్నారు. మండలంలోని ఇరపాడు రైతు భరోసా కేంద్రంలో గ్రామీణ మహిళలకు శనివారం ఆర్థిక నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌లో ఏటీఎం పిన్ నంబర్, ఓటీపీ, ఆధార్ కార్డు నంబర్లు అడిగితే ఎవరికీ చెప్పకూడదన్నారు. ప్రైవేట్ సంస్థల ఆర్థిక నేరాల నుంచి మోసపోకుండా అవగాహన కల్పించారు. డిజిటల్ బ్యాంకింగ్, సామాజిక భద్రత పథకాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సదస్సులో ఆర్థిక అక్షరాస్యత జిల్లా కో ఆర్డినేటర్‌లు వెంకటేశ్వరరావు, పి.హేమలత, డి.గోపి, గ్రామ సచివాలయం వ్యవసాయ సహాయకురాలు కుసుమ, వెలుగు సిబ్బంది, ఎన్‌జీఓ సిబ్బంది పాల్గొన్నారు.